

ప్రాణం తీసిన పూచీకత్తు
తన స్నేహితుడి అప్పు విషయంలో తాను పూచీ పడినందుకు అప్పు ఇచ్చిన వారి చేతిలో చావు దెబ్బలు తిని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ప్రాణాలను కోల్పోయాడు. - 8లో



పేదింటి బిడ్డలు.. వాలీబాల్‌లో మెరికలు
ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నారు రాజంపేట మండలం కూచివారిపల్లెకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.290
రెండోరకం	రూ.150	రూ.200



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1498 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	431
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 541.64 కిలోలు

న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అంతర పంటలతో ప్రకృతి వ్యవసాయం



సేంద్రియ పద్ధతి గురించి వివరిస్తున్న సేంద్రియ వ్యవసాయ అధికారులు

రైల్వేకోడూరు : మండలంలోని బొజ్జవారిపల్లె గ్రామంలో సాయి అనే రైతు తన అరటి తోటలో 20 సెంట్లలో 22 రకాల అంతర పంటలను వేసేందుకు సిద్ధం చేసినట్లు ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి బి. ఉష తెలిపారు. 20 సెంట్లలో ఏటీపీ మోడల్‌ని వేసేందుకు 200 కేజీల ఘన జీవామృతం తయారు చేయించామన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయంతోనే మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఉప సర్పంచ్ తోట శివసాయి, యూనిట్ ఇన్‌చార్జిలు జయమ్మ, తిరుపాలమ్మ, పవన్, గోవింద్ పాల్గొన్నారు.

రవాణాశాఖలో ఇన్‌చార్జి అధికారుల నియామకం



కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అన్నమయ్య, వైఎస్‌ఆర్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాలకు ఇన్‌చార్జిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వైఎస్‌ఆర్ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌గా పని చేస్తున్న మీరా ప్రసాద్ నెల రోజులు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా చిత్తూరు డీటీసీ నిరంజన్ రెడ్డిని నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి ఆర్టీఓగా దినేష్ చంద్ర



ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ఆర్టీఓగా పని చేస్తున్న శాంతకుమారికి డీటీసీగా పదోన్నతి రావడంతో ఏలూరుకు బదిలీ అయ్యారు. దీంతో అన్నమయ్య జిల్లా ఆర్టీఓగా మదనపల్లి ఎంవీఐగా పని చేస్తున్న దినేష్ చంద్రను నియమించారు.

యువగళం కాదు.. యువతకు గాలం



సురేష్ బాబు

సిద్దవటం : నారా లోకేష్ చేపట్టింది యువగళం పాదయాత్ర కాదని.. యువతకు గాలం వేసే కార్యక్రమమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు విమర్శించారు. మండలంలోని మూలపల్లిలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి సురేష్ బాబుతో పాటు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయకుడు లోకేష్ చేపట్టిన పాదయాత్రలో ప్రజలు లేక వెలవెల బోతోందని, పాదయాత్ర టీడీపీ నాయకులకు భారంగా మారిందన్నారు. ఎప్పుడెప్పుడు తమ నియోజకవర్గంలో పాదయాత్ర పూర్తి అవుతుందని టీడీపీ శ్రేణులు నాయకులు తలలు పట్టుకుంటున్నారన్నారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో ఉండే హామీలను అమలు చేస్తానంటే సంక్షేమం..అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తే సంక్షోభమా? చంద్రబాబు మేనిఫెస్టో అమలుతో ఏపీ మరో శ్రీలంకలా మారదా ? అని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడి పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం ది బీసీ ప్రజాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బీసీ విద్యార్థులకు ప్రజ్ఞా పురస్కారాల ప్రదానం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ప్రతిభ గల బీసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. చదువుతోనే ఏదైనా సాధించగలమని విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుపోవాలన్నారు.

చుక్కల చిక్కులనుంచి విముక్తి



“ నా పేరు మల్లారపు వెంకటేశ్వరనాయుడు. సంబేపల్లె మండలంలోని గుట్టపల్లె పంచాయతీ బట్టావాండ్లపల్లె గ్రామం. నాకు 247 సర్వే నంబరులో 2.76 సెంట్ల చుక్కల భూమి ఉంది. ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నాను. మా భూమి రెగ్యులరైజేషన్ చేయాలని ఎన్నోసార్లు అధికారులకు అర్జీలు పెట్టుకుంటూ వచ్చాను. కానీ ఎవరూ సమస్యను పరిష్కరించలేదు. ఎటువంటి దరఖాస్తు లేకుండానే నా చుక్కల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ పూర్తి హక్కులు కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. పూర్తి హక్కులు కల్పించినట్లు జీఓ ఇవ్వడంతోపాటు అధికారుల ద్వారా సీఎం లేఖలను అందిస్తున్నారు.

- దశాబ్దాల తరబడి పడిన ఇబ్బందులకు చరమగీతం
- కొన్నేళ్లుగా రైతు ఆధీనంలో ఉన్నా అమ్ముకోలేని పరిస్థితి
- చుక్కల భూముల రికార్డుల క్లియరెన్స్‌తో నిషేధిత జాబితా నుంచి తొలగింపు
- జిల్లాలో 30,525 రైతన్నల కుటుంబాలకు ప్రయోజనం
- అన్నమయ్య జిల్లాలో 28,882.29 ఎకరాలకు సంపూర్ణ హక్కు
- మార్కెట్ విలువ ప్రకారం రూ. 579.832 కోట్ల విలువైన భూముల అప్పగింత



చుక్కల భూమికి సంబంధించి హక్కు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్ (ఫైల్)

సాక్షి రాయచోటి : బ్రిటీషు వారి కాలం నుంచి దశాబ్దాల తరబడి అన్నదాత చుక్కల భూముల కోసం పోరాటం చేస్తున్నా హక్కు పొందలేని పరిస్థితి. ప్రభుత్వ భూమి, ప్రైవేటు భూమి, ఇతర భూములతోపాటు రికార్డుల్లో పట్టాదారు గడిలో పెట్టిన చుక్కలు రైతన్నకు తలనొప్పిగా మారాయి. ప్రభుత్వాలు మారినా....కొత్త పాలకులు వచ్చినా ఎవరూ రైతన్న ఆవేదనను అర్థం చేసుకోలేని దుస్థితి. అయితే మనసున్న మంచి ప్రభుత్వంతోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మానవతా హృదయంతో అందరికీ మంచి చేస్తున్నారు. అందులో భాగంగా దశాబ్దాల కాలంగా హక్కులేక అల్లాడిపోతున్న అన్నదాతలకు సంబంధించిన చుక్కల భూముల చిక్కులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శాశ్వత పరిష్కారం చూపారు. రెవెన్యూ రికార్డుల్లో చుక్కల భూమిగా నమోదై నిషేధిత జాబితాలో ఉన్న భూములకు విముక్తి కల్పించడంతో అన్నదాత మోముల్లో చిరునవ్వు కనిపిస్తోంది. పైగా అన్నదాతకు ఆ భూములపై పూర్తి స్థాయిలో హక్కులు రావడంతోపాటు క్రయ విక్రయాలకు పూర్తి స్థాయిలో అవకాశం లభించింది.

30,525 మంది రైతన్నలకు ప్రయోజనం

అన్నమయ్య జిల్లాలో దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటూ వస్తున్నా.. అమ్మకాలకు అవకాశం లేక అన్నదాతలు ఆందోళన చెందారు. అన్నదాతల కుటుంబాలకు మేలు చేయాలన్న సంకల్పంతో వారి ఆధీనంలో ఉన్న చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులను సవరించడంతో చాలా వరకు ప్రయోజనం జరిగింది. సుమారు 30,525 మంది రైతులకు సంబంధించి 28,882.29 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ హక్కు కల్పించారు. ఈ భూములపై 579.832 కోట్ల మార్కెట్ విలువ కలిగిన భూములు అన్నదాతలకు అందించారు. గతనెల 12వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా కావలి వేదికగా దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ రైతన్నలకు సంపూర్ణ హక్కు కల్పించారు.

నిషేధిత జాబితా నుంచి తొలగింపు

జిల్లాలో అర్హత కలిగిన రైతులకు సంబంధించి ప్రభుత్వం నేరుగా చుక్కల భూముల డేటాను నిషేధిత జాబితా నుంచి తొలగించింది. 1954కు ముందు ఉన్న చుక్కల భూముల వివరాలను సేకరించి ప్రభుత్వానికి జిల్లా అధికారులు నివేదికలు సమర్పించగా, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 28,882.29 ఎకరాల భూమికి సంబంధించిన సర్వే నంబర్లను నిషేధిత జాబితా నుంచి తొలగించింది. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అన్నదాతలు క్రయ విక్రయాలు చేసుకునేందుకు వీలు కలిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో రాసిన ప్రత్యేక లేఖలను కూడా రెవెన్యూ యంత్రాంగం ఎక్కడికక్కడ లబ్ధిదారులైన రైతులకు అందిస్తోంది.

చుక్కల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో అన్నమయ్య జిల్లాలో అర్హులైన రైతులకు సంబంధించిన చుక్కల భూముల చిక్కులు వీడాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు పడుతున్న అవస్థలు గమనించి దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించారు. జిల్లాలో 30,525 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ 28,882.29 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఈ భూముల విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.579.832 కోట్లు అవుతుంది. దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. దీనివల్ల రైతులకు భూములపై పూర్తిస్థాయిలో హక్కు రావడంతో క్రయ విక్రయాలతోపాటు రుణాలు పొందేందుకు, తనఖా పెట్టేందుకు, వారసత్వ ఆస్తిగా అందించడానికి అన్ని రకాల ప్రయోజనాలు ఒనగూరుతాయి.

– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

సీఎం మేలును మరువలేం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం మాలాంటి రైతులకు చాలా ప్రయోజనకరం. నా పేరుతో లక్కిరెడ్డిపల్లె మండలంలో ఉన్న 0.74 సెంట్ల చుక్కల భూమికి ఇటీవలే పూర్తి హక్కులు కల్పించారు. గతంలో చుక్కల భూమిగా ఉండడంతో ఎలాంటి హక్కులు ఉండేవి కావు. ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కూడా లేక ఇబ్బందులు పడుతూ వచ్చాం. ప్రస్తుతం చుక్కల భూముల జాబితా నుంచి తొలగించి పట్టాగా ఇచ్చి మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎప్పటికీ మరిచిపోము.

– పసుపులేటి పెంచలయ్య, అనంతపురం గ్రామం, చౌటపల్లె కొత్తపల్లె, లక్కిరెడ్డిపల్లె మండలం

వైభవం.. సీతారాముల పౌర్ణమి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతా సమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అనువాద నవలలు ఆవిష్కరణ

మదనపల్లె సిటీ : స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం ప్రజా చైతన్య ప్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ నవలా రచయిత టీఎస్‌ఏ క్రిష్ణమూర్తి రచించిన రెండు అనువాద నవలలను ఆవిష్కరించారు. ఆయన రచించిన కొత్త బంగారు లోకం, కలువ విరిసింది నవలలను కన్నడ బాషలో విజయమ్మ శంకర, కలువ విరిసింది నవలను కన్నడ బాషలో జోస్యుల ప్రభాశాస్త్రి అనువదించారు. ప్రజాస్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ నవలలోని శిల్ప సౌందర్యాలను, భాషా విశేషాలను వివరిస్తూ సమీక్షించారు. కార్యక్రమంలో రచయితలు ప్రసాదరావు, భవానీ ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, రామచంద్రయ్య, నరసింహులు, సురేష్, నాగరాజరావు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం భూములపై సమగ్ర సర్వే

పర్యాటక డీవీఎం గిరిధర్‌రెడ్డి

బి.కొత్తకోట : తిరుపతి, చిత్తూరు, అన్నమయ్యజిల్లాల్లో పర్యాటకశాఖకు చెందిన భూములపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని ఆ శాఖ తిరుపతి డివిజనల్ మేనేజర్ మడితాటి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డీవీఎం అధికారుల బృందం బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై ఉన్న టూరిజం అతిథి గృహాలను పరిశీలించారు. భవనాల ఆధునికీకరణ, సుందరీకరణపై చేపట్టాల్సిన చర్యలపై క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో ప్రభుత్వం తరపున పర్యాటకశాఖకు కేటాయించిన భూముల్లో టూరిజం భవనాలను నిర్మించి కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ భూముల వాస్తవ పరిస్థితి, ఆక్రమణలకు గురయ్యాయా, రెవెన్యూశాఖ భూములను టూరిజంకు కేటాయించినా బదలాయింపు జరిగిందా లేదా పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు. బదలాయింపు జరగని చోట వెంటనే ఏపీటీడీసీ పేరిట బదలాయింపు జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. పర్యాటక ఆదాయం పెంచుకునే దిశగా వ్యాపారాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయన వెంట సాంకేతిక విభాగం డీఈ సుబ్రమణ్యంరాజు, మేనేజర్ నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అతిథిగృహం లోపలి భాగం పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి, అధికారులు

ఉర్దూ ఉపాధ్యాయుల శిక్షణను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ 2018 ఉర్దూ ఎస్‌జీటీ అలాగే 1998, 2008 ఎంటీఎస్ అన్ని యాజమాన్యాలలో పనిచేస్తున్న ఉర్దూ ఉపాధ్యాయుల ఇండక్షన్ ట్రెనింగ్‌ను జయప్రదం చేయాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమాంబాషా, సయ్యద్ ఇక్బాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్‌బాషా, రాష్ట్ర ఆర్థికార్యదర్శి అసదుల్లా ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఇందులో కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల వారికి రాయచోటి డైట్ కళాశాలలో, కోసాంధ్ర జిల్లాలకు గుంటూరు గవర్నమెంట్ డైట్ కళాశాల, కర్నూలు జిల్లా వారికి కర్నూల్ డైట్ కళాశాలలో జూన్ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. అన్ని యాజమాన్యాలలో పనిచేస్తున్న డీఎస్సీ, 2018 ఎంటీఎస్ ఉర్దూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో ఫ్యాక్షన్ నిర్మూలనకు కృషి

డీఎస్పీ వీఎన్‌కే చైతన్య



బ్యాటింగ్ చేస్తున్న డీఎస్పీ చైతన్య

రాజంపేట టౌన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని వై.కోట వంటి సమస్యాత్మకమైన గ్రామాల్లో క్రీడల ద్వారా ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం స్థానిక క్రీడాకారులతో కలిసి డీఎస్పీ నేతృత్వంలో పోలీసులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈసందర్భంగా డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో తరచూ జరిగే వివాదాలు సృష్టిస్తూ, ఘర్షణలను నివారించి క్రీడల ద్వారా గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా అందరు ఇష్టపడే క్రికెట్ క్రీడను ఎంచుకున్నట్లు తెలిపారు. పోలీస్ లెవెన్ పేరిట తమ సిబ్బందితో ఓ జట్టును కూడా తయారు చేశామన్నారు. ఇప్పటికే సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించామని, త్వరలో ఆయా గ్రామాల ప్రజలతో ముందుగా సమావేశమై కక్షలు కార్పణ్యాల వల్ల జరిగే నష్టం, అనర్థాల గురించి వారికి వివరిస్తామన్నారు. వారి మధ్య ఉన్న స్పర్ధను తొలగించి వారిలో స్నేహభావం నింపుతామన్నారు. అనంతరం గ్రామస్తులు ఒక జట్టుగా, తాము ఒక జట్టుగా ఏర్పడి క్రికెట్ మ్యాచ్‌లు ఆడేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమకు పంతాలు, పట్టింపులు, ఘర్షణలే ముఖ్యమని భావిస్తే పిల్లల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదముందన్నారు.

విజయం సాధించిన పోలీస్ లెవెన్ జట్టు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ లెవెన్ జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌ను ఎంచుకుంది. పోలీస్‌లెవెన్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రహమతీయ మజీద్ యాషిన్ లెవన్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి నిర్ణీత ఓవర్లలో 89 పరుగులు మాత్రమే చేసింది. కాగా పోలీస్ లెవెన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన డీఎస్పీ చైతన్య 30 పరుగులు చేయడంతో పాటు రెండు వికెట్లు పడగొట్టి తన జట్టును విజయతీరానికి చేర్చారు.

రాష్ట్ర సీనియర్ షూటింగ్ బాల్ చాంపియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా

మదనపల్లె సిటీ : రాష్ట్ర సీనియర్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్‌ను ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు కైవసం చేసుకుంది. సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం రోళ్ల గ్రామంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లా పురుషుల జట్టు మొదటి స్థానం సాధించింది. మహిళా జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించిన కెప్టెన్ శ్రీకుమార్, మేనేజర్ సుజాత, సౌభాగ్య, క్రీడాకారుల జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఉపాధ్యక్షులు రెడ్డిశ్రీనివాస్, సాగర్, నాగేంద్రప్రసాద్, కార్యదర్శి నరేష్‌బాబు, కోశాధికారి సాయిశేఖర్‌రెడ్డి తదితరులు విజేతలను అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న రాష్ట్ర పురుషుల షూటింగ్‌బాల్ సీనియర్ ఉమ్మడి చిత్తూరు జట్టు

కొత్త బంగారు లోకం

- టీనేజర్లు ఆకర్షణకు గురికావద్దు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇంటర్‌లో గాడి తప్పితే భవిష్యత్తు అంధకారమే
- క్రమశిక్షణతో సాగితేనే విజయం సొంతం
- ప్రారంభమైన జూనియర్ కాలేజీలు

22,219
జిల్లాలో పది పరీక్షలు రాసిన విద్యార్థులు

16,009
పాసైన విద్యార్థులు



మదనపల్లె సిటీ : ఇప్పటి వరకూ హైస్కూలు చదువు... ఇక నుంచి కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. ఈ క్రమంలో కొత్తగా కాలేజీల్లో చేరే విద్యార్థుల్లో పరిచయాలు.. కొత్త వాతావరణం, కొత్త పరిసరాలు, సరికొత్త ఆలోచనలు..అన్నీ కొత్తదనాన్ని ఇచ్చే అనుభవాలే. ఇష్టపడి కాలేజీల్లో అడుగుపెట్టే విద్యార్థులకు ఇవన్నీ వింతగా కనిపిస్తాయి. టీనేజ్‌లో అత్యంత కీలక సమయమిది. జీవితాన్ని మలుపులు తిప్పేది ఇంటర్‌దశలోనే. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం మన చేతిలోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్త విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ఇంటర్ దశలో కొత్త బంగారు లోకం అవుతుంది. భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభమయ్యాయి.

చదువుకే తొలి ప్రాధాన్యం

ఇంటర్ విద్యార్థులు ఎన్నో ఆకర్షణలకు లోనవుతారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమ జీవితం అల్లరిపాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలు ఎగ్గొట్టడం, హీరోయిజం చేయడం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరుకావాలి. పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. స్నేహితులతో కలిపి గ్రూపు స్టడీ చేయడం అత్యంత కీలకం.

స్నేహం ప్రభావితం

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్ది ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. లేదా పశ్చాత్తాప పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజం మీద అవగాహన, లెక్చరర్లపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరెట్లు, గుట్కాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్ దశలోనే బీజాలు పడతాయి. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయవద్దు. అశ్లీలతపై వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకలు పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయనం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

ఏదో తెలియని లోకంలా...



పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఇంటర్‌కు రాగానే ఏదో తెలియని లోకంలా విహరిస్తారు. స్వేచ్ఛా జీవిగా భావిస్తారు. అప్పుడే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. కాలేజీ చదువు ఎంతో విలువైనది.ముఖ్యంగా చెడు వ్యసనాలు, సిగరెట్లు, మద్యం సేవించడం, కాలేజీలకు డుమ్మా కొట్టడం వంటి వాటికి గురికాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. అప్పుడప్పుడు కాలేజీలకు వెళ్లి పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– జయకుమార్, సైకియాట్రిస్టు.మదనపల్లె.

భవిష్యత్తు అంధకారం చేసుకోవద్దు



పదో తరగతి తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఇంటర్‌లో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. ప్రేమ, సినిమా, షికార్ల వైపు దృష్టి మళ్లే వయస్సు ఇది. అటుగా దృష్టి సారిస్తే భవిష్యత్తు అంధకారం అవుతుంది. పదో తరగతి వరకు ఉపాధ్యాయులు స్థానికంగా ఉండటంతో విద్యార్థులకు భయం అనేది ఉంటుంది.

– బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, బాలికల జూనియర్ కాలేజీ,మదనపల్లె.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట పంచాయతీలో అనుమానస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని కుంటకిందపల్లెకు పల్లెకు చెందిన ఇంజేటి హరిప్రసాద్ రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు సీడ్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం కుంటకిందపల్లె సమీపంలోని కంప చెట్లలలో శవమై తేలాడు. విషయం తెలుసుకున్న సిఐ లింగప్ప, ఎస్ఐ షరీఫ్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భార్య కొంతకాలంగా కువైట్‌లో ఉంది. హరిప్రసాద్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇతని మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యాన్ని మదనపల్లె రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురినిఅరెస్టు చేసినట్లు ఎస్.ఐ వెంకటేష్ తెలిపారు. బెంగళూరుకు చెందిన ఎల్లంరాజు, గార్లపాటి చక్రధర్, చాంద్‌బాషా, కిషోర్‌లు కారులో మదనపల్లె వద్దనున్న బోయకొండ గంగమ్మ దర్శానానికి ఆదివారం వస్తుండగా చీకలబైలు వద్ద కారు సహా రూ.12 వేల మద్యంతో నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు.

పిచ్చికుక్క వీరంగం

మదనపల్లె : పిచ్చికుక్క వీరంగం చేసి 30 మందికి పైగా కరవడంతో తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం మండలంలోని మాలేపాడు గ్రామంలో జరిగింది. మాలేపాడులో శనివారం రాత్రి శ్రీ చెన్నకేశవస్వామి తిరుణాల వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో ప్రజలు జాతరకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జాతర నుంచి ఇంటికి తిరిగి వస్తున్న వారిపై ఓ పిచ్చికుక్క దాడిచేసి కరిచింది. కుక్కదాడిలో సుమారు 30మందికి పైగా గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురు చిన్నపిల్లలు ఉన్నారు. పిచ్చికుక్కను పట్టుకునేందుకు స్థానికులు ప్రయత్నించగా తప్పించుకుని సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయినట్లు చెప్పారు.

ప్రసవానంతరం తల్లి మృతి

రాజంపేట : పుల్లంపేట మండలం టి.కమ్మబలిజపల్లె హరిజన వాడకు చెందిన ఇందుకూరి మణెమ్మ(35) అనే గర్భిణి బిడ్డను ప్రసవించి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇందుకూరి మణెమ్మ శనివారం ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఆదివారం బిడ్డను ప్రసవించింది. ప్రసవం సమయంలో రక్తస్రావం ఎక్కువ కావడంతో బిడ్డను ప్రసవించి మృతి చెందింది. అయితే బంధువులు మాత్రం వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింతరాలు చనిపోయిందంటూ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నారు.

పేదింటి బిడ్డలు.. వాలీబాల్‌లో మెరికలు

ఒకే కుటుంబంలో ముగ్గురు
జాతీయ స్థాయి క్రీడాకారులు


వాలీబాల్‌లో ప్రతిభ చాటి కైవసం చేసుకున్న కప్పులు, మెడల్స్


క్రీడాకారుల పేదరికానికి నిదర్శనం ఈ ఇల్లు

రాజంపేట టౌన్ : ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నారు అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం కూచివారిపల్లెకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు. తండ్రి సంచార వ్యాపారానికి, తల్లి కూలీ పనులకు వెళితేనే వారి కుటుంబం గడుస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఉన్న రామ్మోహన్, మణెమ్మల ముగ్గురు పిల్లలు వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరుస్తూ..జాతీయ స్థాయిలో రాణిస్తూ.. తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. సాధారణంగా ఎవరి కుటుంబంలో అయినా పిల్లలు ఒక్కొక్కరు ఒక్కో రంగంలో ప్రతిభ కనబరుస్తారు. అయితే వీరి కుటుంబంలో ముగ్గురు పిల్లలు కూడా వాలీబాల్ క్రీడపై మక్కువ పెంచుకొని రాణిస్తుండటం విశేషం. తేజ, సరిత, సాయిప్రతాప్‌లు పాఠశాల స్థాయిలోనే వాలీబాల్‌లో ప్రతిభచాటడాన్ని గమనించిన రిటైర్డ్ పీడీ, వాలీబాల్ కోచ్ వారిపై ప్రత్యేక దృష్టిసారించి ప్రోత్సహిస్తూ వచ్చారు. ఫలితంగా డిగ్రీ పూర్తి చేసుకొని పోలీస్ సెలక్షన్స్ ప్రయత్నాల్లో ఉన్న తేజ ఏడుమార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఆడింది. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సరిత ఇప్పటి వరకు తొమ్మిదిమార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఆడి రెండుమార్లు బెస్ట్‌ప్లేయర్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాయిప్రతాప్ ఇటీవలే జాతీయ స్థాయి వాలీబాల్‌లో పోటీల్లో ఆడారు.

తలదాచుకునేందుకు సరైన గూడు కూడా లేని దుస్థితి

జాతీయ స్థాయిలో రాణిస్తున్న వాలీబాల్ క్రీడాకారులది ఒక విధంగా కఠిక పేదరికమనే చెప్పాలి. సరైన గూడు కూడా లేక పోవడంతో ఐదుగురు ఉన్న ఈ కుటుంబం తలదాచుకునేందుకు ఇబ్బందులు పడుతోంది. తల్లిదండ్రులు ఎంత కష్టపడ్డా తమ పిల్లల పోషణ, ఇతర అవసరాలకు కూడా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అందువల్ల దాతలు ఎవరైనా తమ పిల్లలకు చేయూతనివ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అమ్మానాన్నల కష్టమే విజయ రహస్యం



మేము ఎస్టీ వర్గానికి చెందిన వాళ్లం. సాధారణంగా మా ఇళ్లల్లో ఆడపిల్లలకు 18 ఏళ్ల లోపే వివాహం చేస్తారు. కానీ మా అమ్మానాన్నలు మాకు వివాహం చేసి చేతులు దులుపుకోవాలనుకోలేదు. బాగా చదివించాలని శక్తికి మించి కష్టపడుతున్నారు. నాన్నకు టీబీ వచ్చినా మా కోసం కష్టపడుతున్నాడు. నేను బీఈడీ పూర్తిచేసి పోలీస్ సెలక్షన్ ప్రయత్నాల్లో ఉన్నా. చదువులోనూ, వాలీబాల్‌లోను విజయం సాధిస్తున్నాను అంటే అది అమ్మానాన్నల కష్టమే.

- తేజ, వాలీబాల్ క్రీడాకారిణి, రాజంపేట

అంతర్జాతీయ స్థాయిలో స్థానమే లక్ష్యం



అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే ఏకైక లక్ష్యం. అందుకోసం కఠోర సాధన చేస్తున్నా. వాలీబాల్ క్రీడలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి. తద్వారా పేదరికం నుంచి బయటపడి అమ్మా, నాన్నలకు కష్టం కలగకుండా చూసుకోవాలనేదే నాకోరిక.

- సరిత, వాలీబాల్ క్రీడాకారిణి, రాజంపేట

అక్కావాళ్ల స్ఫూర్తితోనే



మా ఇద్దరు అక్కయ్యలు వాలీబాల్ పోటీల్లో రాణించేందుకు చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడుతున్నారు. అనేకమార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఆడటం వల్ల వారిని అందరూ గౌరవిస్తున్నారు. నేను కూడా మా అక్కయ్య వాళ్లలాగా అందరితో శభాష్ అనిపించుకోవాలి. వాళ్లను స్ఫూర్తిగా తీసుకుని సాధన చేస్తున్నా. తొలిప్రయత్నంలోనే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఈ క్రెడిట్ అంతా మా కోచ్ షామీర్ సార్‌దే.

- సాయిప్రతాప్, వాలీబాల్ క్రీడాకారుడు, రాజంపేట

కళాకారులకు అండగా ప్రభుత్వం

రాజంపేట రూరల్ : కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆకేపాడులో ఆదివారం జెడ్పీ చైర్మన్‌ను కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం జబ్బిరెడ్డి మాట్లాడుతూ ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ జిల్లా స్థాయిలో విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఆయన సేవలు గుర్తించి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ ప్రశంసా పత్రం అందజేయటం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. అనంతరం కళాకారులు తమ సమస్యలను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట, ఓబులవారిపల్లి, పుల్లంపేట, పెనగలూరు, నందలూరు మండాలాలకు చెందిన కళాకారులు సుబ్బరాయుడు, కృష్ణయ్య, గంగయ్య, సుబ్రమణ్యంరాజు, రవీందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాకారులు

వారం రోజుల్లో అడ్మిషన్ నోటిఫికేషన్

రాజంపేట టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికిగాను వివిధ కోర్సుల్లో ప్రవేశాలకై వారం రోజుల్లో నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు వర్శిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాజంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తంతో కలిసి ఎల్వీకే విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌లో అడ్మిషన్‌ల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకున్న విద్యార్థులు తొలుత ఆన్‌లైన్‌లో అడ్మిషన్ దరఖాస్తు పంపాలన్నారు. తరువాత దరఖాస్తు ప్రింట్, సర్టిఫికెట్లను తాము ఎంచుకున్న అభ్యాసక సహాయ కేంద్రానికి వెళ్లి పరిశీలన చేయించుకుని ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సుకు సంబంధించిన పుస్తకాలు కావాలా? వద్దా అనే విషయాన్ని కూడా తెలియజేయాలన్నారు. పుస్తకాలు కావాలన్న వారికి పోస్టు ద్వారా పంపిస్తామన్నారు. డిగ్రీలో ప్రవేశానికి ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరేందుకు డిగ్రీ ఉత్తీర్ణులై డిగ్రీలో చదివిన సబ్జెక్టును మాత్రమే ఎంచుకోవాలన్నారు. ఎంబీఏలో చేరేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో నిర్వహించే ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. వివిధ కోర్సుల్లో అడ్మిషన్ పొందే విద్యార్థులు ముందుగా ప్రాస్పెక్టస్‌ను విధిగా చదవాలన్నారు. అలాకాకుండా అర్హత లేని సబ్జెక్టుల్లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అడ్మిషన్ రద్దవుతుందని, దీనివల్ల విద్యార్థులు నష్టపోవాల్సివస్తుందన్నారు. ఫీజు ల వివరాలతో పాటు ఆయా ప్రోగ్రామ్స్ కాలపరిమితి, అర్హత వంటి అన్ని వివరాలు వర్సిటీ వెబ్‌సైట్, పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు బోధించేందుకు అర్హులైన అధ్యాపకులు, పరిశోధకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు చెప్పారు. 179 అభ్యాసక సహాయ కేంద్రాల్లో ఇప్పటికే బోధిస్తున్న వారితో పాటు కొత్తవారు కూడా యూనివర్సిటీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎల్వీకే సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి అనుభవం, అర్హతల ఆధారంగా అధ్యాపకులను ఎంపిక చేసుకొని వారి సేవలను వర్సిటీ వినియోగించుకుంటుందని తెలిపారు. విద్యార్థుల సంఖ్యను బట్టి బీఎస్సీ విద్యార్థులకు తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహించే కేంద్రాల సంఖ్యను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే సైకాలజీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ ఇతర సబ్జెక్టుల్లో ప్రాక్టికల్స్ నిర్వహించే కేంద్రాలను పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అదనపు కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి

ఏపీఎండీసీపై టీడీపీ ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రాజకీయ లబ్ధికోసం టీడీపీ నాయకులు ఏపీఎండీసీపై అసత్య ఆరోపణలు చేయడం తగదని ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో బెరైటీస్ ద్వారా రూ. 1100 కోట్ల మేర ఆదాయం వచ్చిందని తెలిపారు. టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు వేల టన్నుల బెరైటీస్ ఖనిజం అక్రమాలు జరిగితే ఇంత ఆదాయం ఎలా వస్తుందని ప్రశ్నించారు. కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉన్న చోట వేల టన్నుల బెరైటీస్ అక్రమంగా తరలించడం ఎలా సాధ్యమవుతుందన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం వద్ద నివేదికలు ఉన్నా కూడా టీడీపీ నాయకులు కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని పచ్చ పత్రికల్లో రాయించడం అర్థరహితమని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏపీఎండీసీ బెరైటీస్ ప్రఖ్యాతి గాంచిందని, దీని ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బెరైటీస్ రవాణా విషయంలో ప్రొడక్షన్ నుంచి స్టాక్ యార్డ్ రవాణా వరకు ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నామని, ప్రతి చిన్న విషయాన్ని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇటీవల కొందరు సిబ్బంది సాంకేతికతను వినియోగించుకొని అక్రమ రవాణకు పాల్పడ్డారని, అప్రమత్తమై ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రత్యేక కమిటీ నియమించామన్నారు. బాధ్యులైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రెండు వాహనాల్లో అక్రమంగా రవాణా చేసిన 35 టన్నుల 100 గ్రాముల బెరైటీస్ ఖనిజాన్ని రికవరీ చేసినట్లు చెప్పారు. ఇందుకు సహకరించినట్లు భావిస్తున్న మూడు ఫల్వరైజింగ్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టామన్నారు. కొందరు ఉద్యోగులు చేసిన తప్పులపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఇందులో దోషులు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రాజెక్టును ఆటోమేషన్ పరిధిలోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. మంగంపేటలో జరిగిన వాస్తవాలు తెలియకుండా కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు రాయడం సరికాదన్నారు. అక్రమ రవాణపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, దీనిపై సందేహాలు ఉంటే ఏపీఎండీసీ మంగంపేట సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలని, పూర్తి వివరాలు తెలియజేస్తారని చెప్పారు. భారీ ఎత్తున అక్రమలు జరిగాయని, ప్రజలను అపోహలకు గురిచేసేవిధంగా ప్రవర్తిస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం మత్తులో దాడి: ఒకరి మృతి

తంబళ్లపల్లె : మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. కోసువారిపల్లె పంచాయతీ ఎర్రివారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి, రాధమ్మల కుమారుడు ఎర్రంరెడ్డి(27), అదే పంచాయతీలోని గుమ్మిడికాయలపల్లెకు చెందిన మధుకర్‌రెడ్డి(28) ఇద్దరూ అవివాహితులే. మద్యానికి బానిసయ్యారు. శనివారం సాయంత్రం సమీప పొలాల్లో మద్యం తాగారు. ఇద్దరి మధ్య మాటలతో ఘర్షణ జరిగింది. మధుకర్‌రెడి ఎర్రంరెడ్డిపై బండరాయితో దాడిచేయడంతో తలకు బలమైన గాయమైంది. కేకలు విన్న గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లి 108కు సమాచారం అందించారు. రక్తపుమడుగులో ఉన్న ఎర్రంరెడ్డిని 108లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడికి చేరగానే మృతి చెందాడు. ములకలచెరువు ఇన్‌చార్జి సీఐ శివాంజనేయులు, సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సీఐ తెలిపారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

మదనపల్లె : పాము కాటేయడంతో రైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం మదనపల్లె మండలం పోతపోలులో జరిగింది. గ్రామానికి చెందిన వీరభద్ర(39) పొలం పనులు చేసుకుంటుండగా విషసర్పం కాటేసింది. దీంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

రైతు ఆత్మహత్య

రాజంపేట : అప్పుల బాధతో ఆదివారం మధ్యాహ్నం కూల్‌డ్రింక్‌లో విషపు గుళికలు కలుపుకుని తాగడంతో మండలంలోని మదన గోపాలపురం గ్రామానికి చెందిన మద్దూరి నాగరాజు కుమారుడు మద్దూరి హరిబాబు (26) ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే హరిబాబు పంటలు సరిగ్గా పండకపోవడంతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు దారి తెలియక ఆత్మహత్యకు చేసుకున్నట్టు తెలుస్తోంది. మృతుడికి ఏడాది వయస్సు ఉన్న కూతురు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినమన్నారు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన పూచీకత్తు

కడప అర్బన్ : తన స్నేహితుడి అప్పు విషయంలో తాను పూచీ పడినందుకు నిందితుల చేతిలో చావుదెబ్బలు తిని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ప్రాణాలను కోల్పోయాడు. హత్య కేసుగా నమోదైన 24 గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ సంఘటనపై ఆదివారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ ఎం.డి షరీఫ్ విలేకరులకు వివరాలను తెలియజేశారు. వైఎస్సార్ జిల్లా ఊటుకూరుకు చెందిన పాలెంపల్లి శ్రీకాంత్ రెడ్డి అక్కాయపల్లిలో నివాసం ఉంటున్నాడు. అతని స్నేహితుడు సత్యనారాయణ అలియాస్ సత్య ఈ కేసులో ప్రధాన నిందితులైన కడప నగరం శంకరాపురానికి చెందిన అండ్లూరు చైతన్యకుమార్ రెడ్డి, చిన్నచౌక్ ముత్తరాసపల్లికి చెందిన అవ్వారు లీల అలియాస్ శ్రీలీల ఒక్కొక్కరి వద్ద రూ. 10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తమ అప్పు తీర్చాలని పెద్దమనుషుల సమక్షంలో అడిగారు. ఆ సమయంలో సత్యనారాయణ స్నేహితుడైన శ్రీకాంత్‌రెడ్డి పూచీపడ్డాడు. తర్వాత పలుకకపోవడంతో మే 31న నిందితులు, మూడో నిందితురాలైన కడప నాగరాజుపేటకు చెందిన, టిఫిన్ సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ అక్క మద్దాల చాముండేశ్వరి ఇంటివద్దకు శ్రీకాంత్‌రెడ్డిని పిలిపించారు. అక్కడ నిర్బంధించి మిగిలిన నిందితుల సహకారంతో కొట్టారు. డబ్బులను కడితేనే వదిలిపెడతామన్నారు. అతన్ని ముత్తరాసపల్లిలోని లీల అలియాస్ శ్రీలీల ఇంటికి తీసుకెళ్లారు కట్టెలతో, క్రికెట్‌బ్యాట్‌తో కొట్టారు, కాళ్లతో తన్నారు. పాలెంపల్లి శ్రీకాంత్ రెడ్డి స్పృహకోల్పోయి అక్కడికక్కడే చనిపోయాడు. తరువాత ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని కాల్చి మాయం చేయాలని నిర్ణయించుకున్నారు. వెంటనే డ్రైవర్ లేకుండా సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటామని ఇతియోస్ కారును బాడుగకు తీసుకున్నారు. రెండు క్యాన్‌లలో 1200 రూపాయలకు పెట్రోల్ తీసుకున్నారు. శవాన్ని కారులో తీసుకెళ్లా చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె పమీపంలో మూలవంకలో కంపచెట్లలో వేశారు. పెట్రోల్ పోసి తగులబెట్టేశారు. దర్యాప్తు వేగంగా నిర్వహించి హత్య కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితులను కనుగొన్నారు. ఈనెల 3వ తేదీన నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఫైనాన్స్ వ్యాపారి అండ్లూరు చైతన్యకుమార్‌రెడ్డి, ముత్తరాసపల్లికి చెందిన అవ్వారు లీల అలియాస్ శ్రీలీల, నాగరాజుపేటకు చెందిన మద్దాల చాముండేశ్వరి, చింతకొమ్మదిన్నె మండలం నరసరామయ్యగారిపల్లికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సోమశివ ప్రశాంత్ యాదవ్ అలియాస్ ప్రశాంత్, పాతకడప మామిడివీధికి చెందిన జకట ఉదయ్‌కిరణ్, శంకరాపురానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సింగనమల వెంకటసాయి, శ్రీలీల భర్త కాకి మోహన చంద్ర ఉన్నారు.

ఆటో, కారు ఢీ: వృద్ధురాలి దుర్మరణం


దుర్మరణం చెందిన వృద్ధురాలు రెడ్డెమ్మ

మదనపల్లె : ఆటోను కారు ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు దుర్మరణం చెందగా ఏడుగురు తీవ్రగాయాల పాలైన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... మదనపల్లె పట్టణం బీకే.పల్లెకు చెందిన ఆటో డ్రైవర్ కరీముల్లా(33) సీటీఎం నుంచి మదనపల్లెకు ఆటోలో ప్రయాణికులను చేరవేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం సీటీఎం నుంచి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో దుబ్బిగానిపల్లె వద్ద ఆర్‌సీ.వడ్డిపల్లెకు చెందిన రెడ్డెమ్మ(70) మదనపల్లెకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆటో మదనపల్లె వైపుకు వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఏపీ-03సీహెచ్-4373 మహీంద్రా కారు ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో వెనుకవైపున కూర్చున్న రెడ్డెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనలో సీటీఎం నేతాజీకాలనీకి చెందిన జయమ్మ(70), అపర్ణ(27) నవనీత్(12), అంగళ్లుకు చెందిన పుష్పవతి(28), వసుధ(10), ఆర్‌సీ.వడ్డిపల్లెకు చెందిన రెడ్డెమ్మ(40), డ్రైవర్ కరీముల్లా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారును ఓ మహిళ డ్రైవింగ్ చేసిందని, ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి ఆమె పరారైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో జయమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యచికిత్సల కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా ఎస్ఐ సుధాకర సిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రెడ్డెమ్మకు నలుగురు కుమారులు. చిన్నకొడుకు వద్ద ఉంటూ స్థానికంగా ఎక్కడ భజనలు జరిగినా వెళుతుండేది. ఈ క్రమంలో మదనపల్లె మండలంలోని ఓ ఆలయంలో భజన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతుండగా ప్రమాదంలో మరణించింది.

రోడ్డుప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ శివారులో ఉన్న గంగా భవాని ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం కారు–ఆటో ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ తులసి నాగప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా...రాజంపేట నుంచి హైదరాబాదుకు వెళుతున్న కారు పెట్రోల్ బంకు నుంచి రోడ్డు పైకి వస్తున్న ఆటోను అతివేగంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న మాచుపల్లి పంచాయతీ తురక పల్లి ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేష్, నారాయణ, వెంకటయ్య, గురవయ్య, ఆంజనేయులు, ఆదినారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రథమ చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.ట్రాఫిక్ అంతరాయం కలగకుండా రహారికి అడ్డంగా ఉన్న వాహనాలను స్థానికుల సాయంతో తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీ కొని వృద్ధుడికి..

రాజంపేట : ఆర్టీసీ బస్టాండులో ఎల్. ఆంజనేయరాజు (రిటైర్డ్ జుడిషియల్ ఉద్యోగి)ని ఆదివారం ఉదయం కడప–తిరుపతి బస్సు ఢీ కొంది. తమ సంబంధీకులను రాయచోటి బస్సు ఎక్కించేందుకు ఆయన ద్విచక్రవాహనంలో వచ్చారు. అదే సమయంలో తిరుపతికి వెళుతున్న బస్సును ప్రమాదవశాత్తు ఢీ కొంది. గాయపడిన ఈయనను చికిత్స నిమిత్తం తిరుపతి కీర్తి ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందచేస్తున్నారు.అర్బన్ పోలీసులు కేసునమోదు చేశారు.

ఆటో బోల్తా..

మదనపల్లె : ఆటో బోల్తా పడి ఆరుగురు గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బొమ్మనచెరువు పంచాయతీ దొనబైలుకు చెందిన కొందరు శనివారం మాలేపాడులో జరిగిన చెన్నకేశవస్వామి జాతరకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలోని దేవళంపల్లె వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బొమ్మనచెరువు పంచాయతీకి చెందిన అలేఖ్య(14), అరుణ(30), భారతి(30) రమణ(13), బొగ్గిటివారిపల్లెకు చెందిన వి.లక్ష్మీదేవి(40), బి.లక్ష్మీదేవి(35), తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో వి.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవిలకు తీవ్రగాయాలు కావడంతో ఐసీయూలో చికిత్సలు అందిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పట్టణంలోని బైపాస్‌రోడ్డుకు చెందిన జయమ్మ(60) మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధపడుతోంది. రాత్రివేళలో ఇంటి నుంచి వెళ్లిపోయి పీటీఎం రోడ్డు పక్కగా నిద్రించింది. గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వృద్ధురాలు కోలుకుంటోంది.